# నవ్వులు : నొవ్వులు

ఇద్దరూ పెన్నదగిన మిత్రులు—

ఎన్నో పోలికలున్నవారు, అందంలో ఒకరిని మించినవారొకరు. కొంటెతనంలో నువ్వా, నేనా అనేవారు- పిఠాపురంలో ఒక సాహిత్య సభలో తటస్థ పడ్డారు.

ఒకరు మునిమాణిక్యంనరసింహారావుగారు, రెండోవారు వేదుల సత్య నారాయణ శాస్త్రిగారు. మునిమాణిక్యం గురించి శివ శంకరశాస్త్రిగారు అనే వారట- 'మా నరసింహారావు చేతులు కడిగి సిరాషాపు పెట్టుకోవచ్చు, అని.

ఇంకో ముచ్చట—వేదుల, మునిమాణిక్యం రాజమండ్రిలో ఒక గదిలో వుండేవారట. ఆ యింటి యజమానిని యేడిపించాలని ఒక పథకం ఆలోచించారు.

తెల్లవారేసరికి యిద్దరూ తీరుబడిగా కూర్చుని మాటల్లో వివాదం ప్రారంభించి కేకల్లోకి పాకి కొట్టుకోవడంలోకి దిగారు.

ఇంటాయన హడలిపోయి పరుగెత్తుకుంటూ వచ్చి 'బాబ్బాబూ అన్నదమ్ముల్లా ఉండేవారు, ఎందుకీ దెబ్బలాట చెప్పండి?' అంటే 'బాబూ మీరే చెప్పండి- ఇతడి కంటె నే నందమైన వాణ్ణి అవునా, కాదా ? అట్లాంటప్పుడు తానే అందగాడినని తెగ గింజుకుంటున్నాడు.' అని వేదుల అంటే, మునిమాణిక్యం 'బాబుగారికి కళ్ళు లేవా ? ఆయన్నే చెప్పమను' అని లేచాడు.

బాబుగారికి కళ్ళుంటే మునిమాణిక్యం అందమైనవాడవడం ఖాయం, లేకపోతే వేదుల-

బాబుగారు తెల్లబోయి తేరుకుని, కళ్ళు మూసుకుని "ఇద్దరూ నవ మన్మథులురా నాయనా! ఇక కాట్లాడకండి" అని విడదీసి వెళ్ళిపోయారట!

మునిమాణిక్యం ఆ సభలో తెలుగులో హాస్యం అనే విషయంమీద మాట్లాడాలి.

కవిత్వంలో నేను ఉద్దండుణ్ణి అని వేదులకు వుంటే కథలలో నేను వాడి తాతను అని మునిమాణిక్యం నమ్మకం.

అహం లేకపోతే మనిషేకాడు. అది ముదిరితేనే బాధ- "తెలుగులో మంచిహాస్యం పూర్వంలేదు పూర్వం వున్నదల్లా తోలుబొమ్మలాటల్లో, బాగో తాలలో ఉన్న అసభ్య హాస్యమే. మన పూర్వకవులు హాస్యం మరిచిపోయి హాస్యాన్ని అపహాస్యం పాలుచేశారు. ఆరోగ్యవంతమైన సభ్యమైనహాస్యం నవ్య సాహిత్యంతోనే పుట్టింది" అని ప్రతిపాదిస్తూ సోదాహరణంగా ప్రసంగం సాగించారు మునిమాణిక్యంవారు.

వేదుల అధ్యక్షుడు, చట్టునలేచి "హాస్యం మన పూర్వకవులు ఎరగని దినుసు కాదు; 'విజయ విలాసం' వంటి పూర్వప్రబంధాలలో కావలసినంత హాస్యం ఉంది చూస్తే' అని రిమార్కు చేసి కూచున్నారు.

చెకుముకిలో నిప్పురవ్వలేచింది.

మునిమాణిక్యం లేచి "ఈ శాస్త్రిగారు ఉభయ భాషలు చదివినవారు- ఈయన్ని చెప్పమనండి చూద్దాం" అని అనిమొన నా మీదకి తిప్పారు. 'కొసరి అబోతు నాబోతు క్రుమ్ములాడ నడుమ నాబెయ్య గతి వచ్చెనాకు, అన్నట్టు నా పని ఇరుకునపడింది. పిఠాపురానికి తుని దగ్గర. తుని తగవు చేయడం మంచిది, అని లేచాను. పెద్దరిద్దరూ నన్ను పరీక్షకు పెట్టారు. ఏవో రెండుమాటలు చెప్పక తప్పదు.

"పూర్వ సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నే నెరిగి నంతవరకు- హాస్యం అంగిరసంగా (ప్రధానరసం) లేకపోవడం నిజం. ఆంగ్ల సాహిత్య సంపర్కం వల్లనే హాస్యానికి ఒక ప్రత్యేక పీఠం ఏర్పడింది. దాని ప్రభావం వల్లనే విశ్వనాథకవిరాజు, భమిడిపాటి, పానుగంటి, గురజాడ, మొక్కపాటి వగైరాలు హాస్యాన్ని అగ్రపీఠం ఎక్కించారు.

కాని, పూర్వం సంస్కృతాంధ్రాలలో హాస్యం లేదనికాని - ఉంటే అది సభ్యంగా లేదనిగాని అనడం సబబుకాదు. 'విజయవిలాసం'లో 'క్రాగియున్నది మిపల నంగంబు జూడ, వీయపురాలి వైతిగదవే' వంటి పద్యాలలో ఉన్నది సరసోక్తికాని హాస్యంకాదు. హాస్యానికి వికృత వాక్య సంఘటన చేష్టాదు లుండాలి. అయితే— 'విజయ విలాసం' కాకపోయినా తిక్కనగారి ఉత్తర కుమార చిత్రణం, నన్నయగారి బకాసుర ఘట్టం, పాండురంగ మాహాత్మ్యంలోని

ఆయుత నియుతుల కథ ఇత్యాదులు తెలుగువారి హాస్య ప్రీతికి నిదర్శనాలు.

ఇక సంస్కృతంలో వాల్మీకి మంచి హాస్యప్రియుడు. శూర్పణఖ కథలో, వానరుల మధువన విహారంలో, కుంభకర్ణ నిద్రాఘట్టంలో, చిత్రించిన హాస్యం సభ్యమైనదీ, సరసమైనదీని.

సాధారణంగా సంస్కృత నాటకాలలో వున్న విదూషకుల హాస్యం తిండిపోతుతనం, అసహజవాక్య ప్రలాపంవంటి వాటివల్ల పుట్టింది కనక, అది మనస్సును రంజింపేది కాదని, ఆధునికుల చాలామంది అభిప్రాయం. కాని అది చాలావరకు ఆపోహ మాత్రమే. చదవక ఎవరో చెబితే ఏర్పరచుకొన్న అభిప్రాయం ! కొన్నివాక్యాలు తిండిపోతు తనం, తెచ్చిపెట్టుకుని నవ్వించేవిగా వున్నా, మాళవికాగ్నిమిత్రంలో విదూషకుని గడుసైన హాస్యం వుంది. అసలు విదూషకుడే విజృంభించి నాటకమంతా నడుపుతాడు. 'మృచ్ఛకటికం'లో శకారుని అసందర్భ ప్రలాపాలకు హాస్యపు విలువ ఇవ్వకపోయినా, మైత్రేయుని మాటలలో, 'కర్ణాట కలహం' లో మంచి హాస్యం దొరుకుతుంది.

సంస్కృతంలో కేవలం హాస్యరస ప్రధానంగా రాసిన ప్రహసనాలు లేకపోలేదు. కాని అవి చాలావరకు అసభ్య హాస్యంతో ఉన్నవి గనక తీసివేద్దాం.

ఇంకొక్కమాట చెబుతాను, మన్నించండి. వేదులవారు విదేశీ హాస్య రచనలు చదివితే, మునిమాణిక్యం తిక్కనగారి ఉత్తరుణ్ణి, వాల్మీకి మధువనాన్ని చూస్తే, 'పడ్లగింజలో బియ్యపుగింజ' అసలీ చర్చేలేదు." అని నవ్వుతూ కూర్చున్నాను. వాతావరణంలో వేడి తగ్గింది.

●